క్లుప్తంగా

14 నుంచి సింగరాల మల్లన్న జాతర



తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగా రెడ్డిపల్లి సింగరాల మల్లన్న జాతర ఉత్సవాలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నారు. గ్రామ శివారులోని గుట్టపై సహజంగా వెలిసిన మల్లన్నకు ప్రాచీన కాలం నుంచి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రతి ఏటా ఉత్సవాలు జనవరి మొదటి ఆదివారం ప్రారంభమై ఉగాది వరకు ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహిస్తారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ జ్యోతి తెలిపారు. ఆదివారం బోనాలు, ఎడ్లబండ్ల ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

'బీజేపీ విధానాలు తిప్పికొట్టాలి'

తొగుట(దుబ్బాక): బీజేపీ మతోన్మాద, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండలస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాల మార్పునకు కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మోదీ పాలనలో ఆకలి, నిరుద్యోగం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల సీఐటీయూ అధ్యక్షురాలిగా వసంతను ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: మోడల్ స్కూల్‌లో 2024- 25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గజ్వేల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఇతర విద్యార్థులు రూ. 125తో ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల విహారయాత్ర



రామప్ప దేవాలయంలో విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం విహారయాత్రకు వెళ్లారు. వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయం, లక్నవరం, భద్రకాళీ దేవాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి 'పొన్నం'ను విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నేతలు

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ విమర్శిస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్, నాయకుడు రాంబాబునాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ.. సతీశ్‌కుమార్‌కు కనీసం మండలంలోని గిరిజన తండాల పేర్లు కూడా తెలియవని ఎద్దేవా చేశారు. గిరిజన తండాల అభివృద్ధిని కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రవి, నాయకులు భాస్కర్‌నాయక్, మోహన్‌నాయక్, శ్రీనివాస్, చిన్నరాజు, సుమన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

హుస్నాబాద్: బైండ్ల (భవనీయ) సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరికి చెందిన వేముగంటి కుమారస్వామిని ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరిశంకర్, ప్రధాన కార్యదర్శి ఏర్పుల భాస్కర్ చేతుల మీదుగా కుమారస్వామి నియామక పత్రం అందుకున్నారు.

చెక్.. ధాం

- కట్టిన ఏడాదికే కొట్టుకుపోయింది
- ఐదు నెలలైనా పట్టించుకోని అధికారులు





నీరు లేక వెలవెలబోతున్న చెక్‌డ్యాం, (ఇన్‌సెట్) ఖాత వద్ద ధ్వంసమైన చెక్‌డ్యాం గైడ్‌వాల్

నంగునూరు(సిద్దిపేట): అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపమైంది. ప్రభుత్వం రూ. కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఐదు నెలలుగా నీరంతా వృథాగా పోతున్నా ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నంగునూరు మండలం గుండా పారే మోయతుమ్మెద వాగు నుంచి వృథాగా పోయే నీటికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏడు చెక్‌డ్యాంలు నిర్మించింది. అయినప్పటికీ నీరు వృథాగా పోవడంతో చుట్టుపక్కల గ్రామాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో అప్పటి మంత్రి హరీశ్‌రావు ఖాత వద్ద మరో రెండు చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. 2020 మేలో రూ. 4.60 కోట్లతో సందింటి వెంకట్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద ఒక చెక్‌డ్యాం, దారం తిరుపతిరెడ్డి బావి వద్ద రూ. 4.75 కోట్లతో మరో చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ చేశారు. సంబంధిత కాంట్రాక్టర్లు 2022లో నిర్మాణాలు పూర్తి చేయడంతో రెండు చెక్‌డ్యాంలు వినియోగంలోకి వచ్చాయి.

రెండుగా చీలిన గైడ్‌వాల్

2023 ఆగస్టులో భారీ వర్షాలతో మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో సందిటి వెంకట్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద నిర్మించిన చెక్‌డ్యాం రెండుగా చీలి కొట్టుకుపోవడంతో నీరంతా వృథాగా పోయింది. నిర్మాణం పూర్తి కాగానే గైడ్ వాల్స్‌కు ఇరువైపులా ఫ్లడ్ బ్యాంక్ నిర్మాణం చేపట్టకపోవడంతో ధ్వంసమైనట్లు తెలుస్తోంది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన చెక్‌డ్యాంలు వరద ఉధృతికి చెక్కుచెదరకపోగా నూతనంగా నిర్మించిన రెండు చెక్‌డ్యాంలో ఒకటి ధ్వంసం కావడంతో నాణ్యతా లోపం బహిర్గతమైంది. చెక్‌డ్యాం గైడ్‌వాల్ రెండుగా చీలడంతో నీరు వృథా కాగా.. ఐదు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరెళ్తున్నారా.. జర భద్రం



మాట్లాడుతున్న ఏసీపీ సతీష్

మద్దూరు(హుస్నాబాద్): సంక్రాంతికి ఇతర గ్రామాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ ఏసీపీ వాసల సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో సంక్రాంతి సెలవుల్లో జరిగిన దొంగతనాలను పరిగణలోకి తీసుకుని ప్రజలు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు తమ ఇళ్లలో బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంచవద్దన్నారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. అలాగే పిల్లలు పతంగులు ఎగురవేస్తున్న క్రమంలో విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని.. తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో గుడుంబా, గంజాయి విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ షేక్ యునూస్ అహ్మద్ అలీ ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం దుద్దెడలోని ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా కృష్ణ, సలహాదారులుగా సంజీవ్, సురేందర్, కిషన్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌లోకి మల్లంపల్లి సర్పంచ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి సర్పంచ్ మార్క తిరుపతిగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాజ్‌గార్డెన్‌లో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు కోసం బ్యాంకుల్లో రూ. 7,500 కోట్లు నిల్వ ఉంచినా నేటికీ రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాజకీయంగా తనను ఎదుర్కొలేక అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేసి బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు. తన నెల జీతం కూడా ప్రజల అవసరాలకే ఖర్చు చేస్తానని ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగభాస్కర్‌రెడ్డి, మహిళా శాఖ అధ్యక్షురాలు అరుణ, యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, దూల్మిట్ట సర్పంచ్ దీపిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్‌లో చేర్యాల, కొమురవెల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గెలుపు కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, తలారి కీర్తన, కొమురవెల్లి జెడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మండల పార్టీ అధ్యక్షుడు అనంతుల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి



హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టిజన్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ సంస్థలో ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆర్టిజన్ కార్మికులు కోరారు. ఈమేరకు గురువారం సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. సమానపనికి సమాన వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం పూజల హరికృష్ణ మాట్లాడుతూ.. ఆర్టిజన్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం దిశగా నావంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ జీఎస్ కృష్ణ, పెర్క సందీప్, నాగూర్, మోహన్‌రావు, కలీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన పీఏసీఎస్ వ్యవహారం



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ కైలాసం

దుబ్బాక టౌన్: దుబ్బాక పీఏసీఎస్ వ్యవహారం చినికి చినికి గాలివానలా మారింది. కొన్ని రోజుల క్రితం దుబ్బాక పీఏసీఎస్‌లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు డైరెక్టర్లు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తాజాగా గురువారం పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ కైలాసం, వైస్ చైర్మన్ కాలువ నరేష్ వేర్వేరుగా మీడియా సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై తనకు ఎలాంటి సంబంధం లేదని చైర్మన్ కైలాసం అన్నారు. ఈ వ్యవహారంలో అనవసరంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. ప్రతిపక్షాలు వాస్తవాలను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. పీఏసీఎస్‌లో జరిగిన అవినీతి అక్రమాలతో సంబంధం ఉన్న చైర్మన్ కైలాసం, సీఈఓ లక్ష్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ నరేష్ డిమాండ్ చేశారు. ఇప్పటికే చైర్మన్‌పై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టారు.

రంగుల హరివిల్లు.. భోగి మంటలు

పాఠశాలల్లో సంక్రాంతి సందడి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సందడి నెలకొంది. విద్యార్థినుల ముగ్గులు ఆకట్టుకోగా.. వివిధ రూపాలలో చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.



సిద్దిపేటరూరల్: కేజీబీవీ పాఠశాలలో..



చేర్యాలలో..



సిద్దిపేటలోని సెలెస్టియల్ హైస్కూల్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

సీఎం చిత్రపటం బహూకరణ



తహసీల్దార్‌కు సీఎం చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు తహసీల్దార్ జయలక్ష్మికి కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని బహూకరించారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అజ్జు యాదవ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బంక చిరంజీవి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్ కుమార్, మల్లేశం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఓబన్నకు నివాళి



ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం సభ్యులు

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో గురువారం వడ్డె ఓబన్న జయంతిని వడ్డెర సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో వడ్డెర కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి సత్తా చాటాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కర్నాల అక్షయ, దుద్దెడ అక్షయ, కర్నాల వరలక్ష్మి ఇటీవల రాష్ట్రస్థాయి వాలీబాల్, టెన్నిస్ వాలీబాల్ పోటీలో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈనెల 29న కర్నాటకలో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు పీఈటీ నరేష్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు సాదత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



మద్దూరు(హుస్నాబాద్): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం దూల్మిట్ట మండలకేంద్రంలో మండలస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుబ్బుడు దీపిక తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ



అక్షింతలతో భక్తులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో గురువారం విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం నుంచి దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అలాగే ప్రతీ ఇంటికి అయోధ్య రామ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ సాగులో మెలకువలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వస్తుందని ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ అన్నారు. గురువారం రైతు వర్దోల్ రాజయ్య పొలంలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటను పరిశీలించి నీటి యాజమాన్య పద్ధతులు, సమగ్ర పోషణ, అంతర పంట, గెలల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్, నితీష్, అయిలయ్య, రవీందర్‌రెడ్డి, రాములు, రాజయ్య, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాన్గల్‌లో వాలీబాల్ పోటీలు

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్‌లో ఈనెల 14వ తేదీ నుంచి ముడికె రాజయ్య స్మారక మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ సేవలోనే నిజమైన తృప్తి



దుబ్బాకరూరల్: మండలంలోని పోతారంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సల్కం మల్లేశం గురువారం గ్రామస్తులకు మాస్కులు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసినప్పుడే నిజమైన తృప్తి ఉంటుందన్నారు. ప్రజలకు ఏ ఆపద వచ్చిన తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. గతేడాది వాటర్ క్యాన్లు అందించానని.. రాబోయే వేసవిలో అంబలి కేంద్రాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేటలో బుధవారం రాత్రి పోలీస్ బృందం సైబర్ నేరాలపై కనువిప్పు కార్యక్రమం నిర్వహించింది. ఈసందర్భంగా ఎస్ఐ గంగరాజ్ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేసి బ్యాంకు వివరాలు అడిగితే తెలపకూడదన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే 100కు కాల్ చేయాలని సూచించారు.

◆ నేడు ఉచిత వైద్య శిబిరం

మిరుదొడ్డి(దుబ్బాక): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురువారం మిరుదొడ్డి మండల కేంద్రంలో నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో ఆర్‌వీఎస్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిద్దిపేట ఆధ్వర్యంలో ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మొగుళ్ల ఐలయ్య తెలిపారు.

◆ సన్మానం



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయ నూతన చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డిని హైదరాబాద్‌లో యాదవ డోనర్స్(దాతలు) గురువారం సన్మానించారు. ఈసందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అవసరమని పేర్కొన్నారు.

◆ బెల్టు షాపులను నిర్మూలించాలి

హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో బెల్టు షాపుల నిర్వాహకులు కల్తీ మద్యం విక్రయిస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకొని బెల్టు షాపులను మూసివేయించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు పచ్చిమట్ల రవీందర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామాల్లో బెల్టు షాపులను మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ ముద్దాపూర్‌లో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్‌లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు సాగు పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, వైద్యాధికారి బల్బీర్‌సింగ్ ఎంఎల్‌హెచ్‌పీ ఉదయ్‌కిరణ్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును గురువారం హుస్నాబాద్ ఏసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. గురువారం నర్సాయిపల్లిలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, మద్దూరు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీతో కలిసి పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

◆ స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యం

దుబ్బాకటౌన్: స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023కు సంబంధించి దుబ్బాక పురపాలికకు నేషనల్ ర్యాంకు 476, స్టేట్ ర్యాంకు 18, జోన్ ర్యాంకు 8 వచ్చిందని తెలిపారు. రానున్న రోజుల్లో దుబ్బాక పురపాలికను మరింత స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.